## క్లుప్తంగా

### హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



జడ్జి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

తాడిపత్రి అర్బన్‌: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డిని తాడిపత్రి న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్జికి తాడిపత్రి బార్‌ అసోసియేషన్‌ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. తాడిపత్రి కోర్టులో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టును భర్తీ చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు బార్‌ అసోసియేషన్‌ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఆర్‌ ఆర్‌రెడ్డి, సెక్రటరీ వై.ఎస్‌.వాసు, సభ్యులు సాహుల్‌, సూర్యనారాయణ, ఎస్‌ఎల్‌ఎన్‌.ప్రసాద్‌, న్యాయవాదులు సదాశివరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

### భక్తితో ఉన్నత విలువలు




ప్రసంగిస్తున్న రామానుజ జీయర్‌ స్వామి

తాడిపత్రి అర్బన్‌: భక్తితోనే ఉన్నత విలువలు పెంపొందుతాయని అహోబల రామానుజ జీయర్‌ అన్నారు. భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం స్థానిక ఎస్‌ఎల్‌ఎన్‌ గార్డెన్స్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ భక్తి ఉంటేనే విలువలు కలిగిన వ్యక్తులవుతారన్నారు. యువత దేశ, దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు.

### ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌



గుత్తి: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి (రైట్స్‌ ప్రొటెక్షన్‌ కౌన్సిల్‌) జిల్లా అధ్యక్షుడిగా గుత్తికి చెందిన మంగే రమేష్‌ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ మండలి రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీల హక్కుల పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

### 'వామ్‌' ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన



జాతీయ గీతాలాపన చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్‌: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్‌) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8.20 కు స్థానిక గాంధీ సర్కిల్‌లో జాతీయ గీతాలాపన చేశారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తాడిపత్రి శాఖ అధ్యక్షుడు వంకదారి మద్దిలేటి (రాజ) మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రధాన కూడళ్లలో జాతీయ గీతాలాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో వామ్‌ కార్యదర్శి జయవరం రామచంద్రయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు కంభం నాగరత్న, కార్యదర్శి నగరూరు స్వర్ణలత, కోశాధికారి ముత్యాల సుబ్బలక్ష్మీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించండి



తాగునీటి సమస్యపై జెడ్పీ చైర్‌ పర్సన్‌ గిరిజమ్మతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మేజర్‌ పంచాయతీ పరిధిలోని అనంతసాగర్‌ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీ చైర్‌ పర్సన్‌ గిరిజమ్మను శింగనమల ఎమ్మెల్యే శ్రావణి కోరారు. సోమవారం జెడ్పీ చాంబర్‌లో జెడ్పీ చైర్‌ పర్సన్‌ను ఎమ్మెల్యే కలసి తాగునీటి సమస్యపై చర్చించారు. ముందుగా చైర్‌ పర్సన్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతసాగర్‌ కాలనీ అనంతపురం నగరానికి సమీపంలో ఉందన్నారు. కాలనీలో తాగునీటి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు ఇటీవల తమ దృష్టికి తీసుక వచ్చారన్నారు. కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చైర్‌ పర్సన్‌ హామీ ఇచ్చారు.

### హామీ నిలబెట్టుకోవాలి



ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ప్రభుత్వ కొలువులకు నోటిఫికేషన్‌ ఇవ్వాలి. ఉద్యోగవకాశాలు కల్పించే వరకు సూపర్‌సిక్స్‌ హామీ మేరకు నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేలు చెల్లించాలి. గత చంద్రబాబు పాలనలో కూడా భృతి ఇస్తామని మాటతప్పారు. ఈ సారి కూడా హామీని తుంగలో తొక్కకుండా నిరుద్యోగులందరికీ భృతి ఇవ్వాలి.

– డి.అబ్దుల్‌ బాసిద్‌, విద్యార్థిసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, గుంతకల్లు

### సీఎం హామీ ఉత్తిదేనా?



నా డిగ్రీ పూర్తయి 10 ఏళ్లయ్యింది. 2014లో నిరుద్యోగ భృతి ఇస్తానంటూ నిరుద్యోగులకు ఆశచూపి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. 2024లో కూడా నిరుద్యోగ భృతి ఇస్తానంటూ యువతను నమ్మించి మళ్లీఅధికారంలోకి వచ్చారు. అధికారం దక్కించుకొని నెల రోజులు దాటినా చంద్రబాబు నిరుద్యోగభృతిపై నోరుమెదపడం లేదు. బాబు మోసానికి నిరుద్యోగులైన నాలాంటి ఎంతోమంది మోసం పోయాం.

–ఎస్‌ గణపతి, దేవరపల్లి, పామిడి మండలం

### నిరుద్యోగులను నిండా ముంచాడు



అధికారం కోసం చంద్రబాబు నిరుద్యోగులను మోసం చేయడం ఇది రెండోసారి. 2014, 2024లో నిరుద్యోగుల ఓట్లతో గట్టెక్కారు. నిరుద్యోగ భృతి దక్కకపోవడంతో నిరుద్యోగులకు మరోసారి చేదు అనుభవమే ఎదురైంది. ఎన్నికలకు ముందు ఉద్యోగం, భృతి ఆశచూపి, అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఆ ఊసే ఎత్తకపోవడంతో మళ్లీ మోసపోయాం

–ఎం.శ్రీనివాసులు రెడ్డి, దేవరపల్లి, పామిడి మండలం

### నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



టీడీపీ కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు , పవన్‌ కళ్యాణ్‌, లోకేష్‌ ప్రకటించారు. దీంతో నమ్మి టీడీపీ కూటమికి ఓట్లు వేసి గెలిపించాం. నెలకు రూ. 3000 నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలి. నిరుద్యోగ భృతి వస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నాం. గతంలో మాదిరిగా చేయకుండా వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేకపోతే ఆందోళన చేయాల్సి వస్తుంది.

–వెంకటేష్‌, గుత్తి

# బాబూ.. నిరుద్యోగ భృతి ఏదీ?


గుంతకల్లు నియోజకవర్గంలో కుటుంబాలు
**83,908**

తాడిపత్రి నియోజకవర్గంలో కుటుంబాలు
**85,042**

శింగనమల నియోజకవర్గంలో కుటుంబాలు
**73,956**

- పథకంపై నోరుమెదపని ప్రభుత్వం
- హామీ అమలుపై యువత ఆందోళన

సాక్షి నెట్‌వర్క్‌: ప్రతి ఒక్కరికీ ఉద్యోగమిస్తాం.. లేదంటే ఉద్యోగం వచ్చే వరకూ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటినా నిరుద్యోగ భృతిపై నోరు మెదపలేదు. కూటమి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌ సిక్స్‌ హామీల్లో ప్రధానమైన నిరుద్యోగ భృతిపై యువత వేయి కళ్లతో ఎదురు చూస్తోంది. నెలకు రూ.3 వేల చొప్పున వెంటనే చెల్లించాలని నిరుద్యోగ యువత డిమాండ్‌ చేస్తోంది. 2014 ఎన్నికల్లో జాబు రావాలంటే.. బాబు రావాలని డబ్బాలు కొట్టుకుని తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతికి ఎగనామం పెట్టినట్లు ఈసారి కూడా అలానే చేస్తారేమోనని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గుంతకల్లు నియోజకవర్గంలో దాదాపు 83,908, తాడిపత్రి నియోజకవర్గంలో 85,042, శింగనమల నియోజకవర్గంలో 73,956 కుటుంబాలున్నాయి. ఆయా కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని లేకుంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.




### ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని ఇస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. లేకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– వంశీ యాదవ్‌, కసాపురం, గుంతకల్లు

### హామీ మరిచారు



సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచారు. ఇంటింటా ఉద్యోగం అన్నారు. లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని నమ్మించి యువతను, చదువుకున్న వాళ్లను నట్టేట ముంచారు. చంద్రబాబు నాయుడు మాటలను నమ్మి నడిరోడ్డుపై ఉన్నాం. ఇప్పటికైనా ఆయన స్పందించి నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగులు ఆందోళన బాట పడతాం.

– పెద్దిరాజు, గొడ్డుమర్రి, యల్లనూరు

### గతంలో కూడా మోసం చేశారు



ప్రభుత్వం కొలువై నెల గడుస్తున్నా నిరుద్యోగులకు ఇవ్వాల్సిన భృతిపై సీఎం చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. సూపర్‌ సిక్స్‌ పథకాల్లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు కోచింగ్‌కు వెళ్లేందుకు ఆర్థిక తోడ్పాటు లేక గ్రామంలోనే వ్యవసాయం, చిన్న చిన్న పనులు చేసు కుంటూ కాలం వెల్లదీస్తున్నారు. గతంలో కూడా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారు.

– సురేష్‌ ,శిరివరం, గార్లదిన్నె మండలం

### అర్హులందరికీ ఇవ్వాలి



సీఎం చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ భృతి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలి. ఎన్నికలకు ముందు ఒకమాట, ఎన్నికలు పూర్తయిన తరువాత ఇంకో మాట మాట్లాడటం సరైంది కాదు. ప్రభుత్వం విద్యార్హతలు, ఇతర నిబంధనలు చూపి భృతి ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయింది. వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

– రమేష్‌, వైటీ.చెరువు, గుంతకల్లు మండలం

### మళ్లీ మోసం చేయొద్దు



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఇందులో చాలా మంది నిరుద్యోగులు జాబ్‌ క్యాలెండర్‌, నిరుద్యోగ భృతి లాంటి వాగ్దానాలను నిమ్మి కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. వారి మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలి. గతంలో ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి అధికారంలోకి రాగానే మోసం చేశారు.

– మహేష్‌, పుట్లూరు

### 'భృతి' కోసం ఎదురుచూస్తున్నాం



నేను బీఎస్సీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాను. ఇంటికో ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఉన్నాం. కూటమి ఎన్నికల వాగ్దానంగా ప్రతి ఇంటికీ ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. ఉద్యోగం రాకపోతే కనీసం నిరుద్యోగ భృతి ఇసామన్నారు. ఇందుకు ఇప్పటి వరకూ ఎలాంటి విధి విధానాలు ప్రకటించకపోవడం దారుణం.

– జి.నవీన్‌కుమార్‌, పి.జలాలపురం, శింగనమల మండలం

### నిరుద్యోగ భృతి లేనట్టేనా...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి నెల గడిచినా కూడా హామీని పట్టించుకోలేదు. నిరుద్యోగ భృతిని విస్మరిస్తే మండలంలోని 13,941 మంది నిరుద్యోగులకు చంద్రబాబు నాయుడు మోసం చేసినట్లే . నిరుద్యోగ భృతి ఖచ్చితంగా ఇవ్వాల్సిందే.

–ఆదంబాబు, కోనుప్పలపాడు, యాడికి మండలం

### హామీ నెరవేర్చాలి



నేను 2012లో ఎంబీఏ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతిపై హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు న్యాయం చేస్తానని ఎన్నికల సమయంలో చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– మురళీమోహన్‌రెడ్డి, నిరుద్యోగి, పెద్దవడుగూరు

### ఉద్యోగ ప్రకటన చేయాలి



ముఖ్య మంత్రి చంద్రబాబు నిరుద్యోగులకు అండగా ఉంటామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగ ప్రకటన చేయాలి. అధికారంలోకి వచ్చి నెల దాటినా ఇంత వరకు నిరుద్యోగుల గురించి ఎక్కడా మాట్లాడలేదు. వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి.

– రాజశేఖర్‌రెడ్డి, గోవిందపల్లి, బీకేఎస్‌ మండలం

## సంక్షిప్త సమాచారం

**పశువుల షెడ్లకు దరఖాస్తుల ఆహ్వానం**

గుత్తి రూరల్‌: ఉపాధి హామీ పథకం కింద పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు ఉన్న రైతులు షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఖాళీ స్థలాలు ఉన్న రైతులు సచివాలయాల్లోని పశు సంవర్థక శాఖ సహాయకుడిని సంప్రదించాలన్నారు. అనంతరం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలోని ఉపాధి హామీ ఏపీఓకు అందించాలన్నారు. విచారణ అనంతరం షెడ్లను మంజూరు చేస్తామన్నారు.

**ఘనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ జయంతి**

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో సోమవారం స్వాతంత్య్ర సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ 115వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్ల అసోసియేషన్‌ నాయకులు రామ్మోహన్‌, కుళ్లాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

**సీజనల్‌ వ్యాధులపై దృష్టి సారించండి**

పెద్దపప్పూరు: సీజనల్‌ వ్యాధులపై దృష్టిసారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్‌ ఉషారాణి సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే నిర్వహించాలన్నారు. అలాగే సీజనల్‌ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీలు, ఇళ్ల చుట్టూ మురుగు ప్రాంతాల్లో పారిశుద్య కార్మికుల చేత బ్లీచింగ్‌ పౌడర్‌, సున్నపు పొడి చల్లించాలని మలేరియా యూనిట్‌ అధికారి శ్రీనివాసులు,హెల్త్‌ సైపర్‌వేజర్‌ శర్మాస్‌ వలి సూచించారు. అనంతరం వారు దేవుని ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించి డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

**నిందితుడి అరెస్టు**

నార్పల: మైనర్‌ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడు నాగరాజును అరెస్టు చేశామని డీఎస్పీ వెంకటశివారెడ్డి సోమవారం తెలిపారు. నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

**దివ్యాంగులకు పరికరాలు**

శింగనమల: మండల కేంద్రంలోని విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లో సోమవారం దివ్యాంగులకు చేతికర్రలను హెల్త్‌ సూపర్‌ వైజరు అశ్వర్థు పంపిణీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన వాటిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ ప్రొవైడరు దివ్యభారతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**విద్యా సామగ్రి పంపిణీ**

యల్లనూరు: మండలంలోని శింగవరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 51 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏతు ధనలక్ష్మి తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, రబ్బర్లు తదితర వస్తువులను అందజేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఆలయం వద్ద అన్నదానం**

పుట్లూరు: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 39 వారాలుగా ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌.ఓబుశేషు. రామేశ్వరరెడ్డి, మద్దిలేటి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

**బొలేరో బోల్తా.. ఇద్దరికి గాయాలు**

గార్లదిన్నె: మండలంలోని ఓబులాపురం కొట్టాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. శింగనమల మండలం చిన్న జలాలపురానికి చెందిన 13 మంది మహిళలు చీనీకాయలు తొలగించే పనికి గార్లదిన్నెకు వెళ్లారు. వర్షం కారణంగా పని లేకపోవడంతో కూలీలంతా బొలేరో వాహనంలో ఇంటికి బయలుదేరారు. ఓబులాపురం కొట్టాల వద్దకు రాగానే ఎదురుగా లారీ రావడంతో బొలెరో వాహనం సైడ్‌ ఇచ్చేందుకు రోడ్డు దింపగా ఒక వైపు వాలిపోయింది.దీంతో వాహనంలో ఉన్న రామలక్ష్మి, లక్ష్మి గాయపడ్డారు. వెంటనే 108లో వారిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు**

తాడిపత్రి రూరల్‌: యల్లనూరు రోడ్డులోని పప్పుల బట్టీ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మద్యం మత్తులో సోమవారం దస్తగిరి అనే వ్యక్తి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. అతడిని చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించామన్నారు.

**హెచ్చెల్సీ కాలువలు ఆధునీకరించాలి**

గార్లదిన్నె: మండలంలోని మిడ్‌పెన్నార్‌ డ్యాం పరిధిలో ఉన్న ఉత్తర, దక్షిణ కాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టాలని రాయల సీమ రైతు సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను తహసీల్దార్‌ లోకేశ్వరికి అందజేశారు. కార్యక్రమంలో రాయల సీమ రైతు సంఘం నాయకులు తాత య్య, సుబ్బారావు పాల్గొన్నారు.

**వ్యక్తికి గాయాలు**

తాడిపత్రి రూరల్‌: మండలంలోని సజ్జలదిన్నె సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామచంద్ర(54) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. మండలంలోని కావేటి సముద్రానికి చెందిన ఆయన బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. అతడిని అనంతపురం తరలించారు.

### మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

పుట్లూరు: మొక్కలను పెంచుదాం...పర్యావరణాన్ని రక్షించుకుందామని ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ ఎస్‌.బి జగన్నాదం అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఓబుళాపురం గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మల్లేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ఆయన మొక్కలను నాటారు. అనంతరం ఆయన అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి వెంకటరమణ, గయాజుద్దీన్‌, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని ఫారెస్ట్‌ అధికారిణి దీప సూచించారు. సోమవారం స్థానిక కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్‌..

గుంతకల్లు రూరల్‌: మండలంలోని కసాపురం గ్రామంలో ప్రమాదస్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్‌ శాఖ అధికారులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం వెనక ఉన్న కోనేరు సమీపంలో ఏర్పాటు చేసిన 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి గత 20 రోజులుగా మంటలు వ్యాపిస్తూ నిప్పులు రాలుతున్నాయి. ఆందోళనకు గురైన స్థానికులు విద్యుత్‌ శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ నెల 13న సాక్షి పత్రికలో 'ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌' అనే శీర్షికతో వార్త ప్రచురితం అయింది. వెంటనే స్పందించిన ఏడీ రంగస్వామి సోమవారం తన సిబ్బందితో కలసి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## శింగనమలలో ఘనంగా సరిగెత్తు



పామిడి కాగితాలవీధిలో కొలువుదీరిన ఇమాం కాశీం పీర్లస్వాములు



శింగనమలలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



యల్లనూరు మండలం శింగవరంలో పీర్లు



గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో పీర్ల స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

శింగనమల: మొహరం సందర్భంగా శింగనమలలో సోమవారం సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగనమల, గోవిందరాయునిపేట, చిన్నజలాలపురం, గురుగుంట్ల పీర్లను ఊరెగించారు. కార్యక్రమంలో నాలుగు గ్రామాల ప్రజలు ఉల్లాసంగా పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

యల్లనూరు: మండలంలోని శింగవరం, చింతకాయమంద, గొడ్డుమర్రి, తిమ్మంపల్లి, కల్లూరు తదితర గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పీర్లు కొలువుదీరాయి. భక్తులు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

**17న ఎర్రబీళ్లల్లో సందడి**

యల్లనూరు మండలంలోని చింతకాయమంద, శింగవరం గ్రామ సరిహద్దుల్లో ఐదారు గ్రామాల పీర్లు 17వ తేదీ ఉదయం 11గంటలకు సలాం అందుకొని కాసేపు కలియతిరిగి గ్రామాలకు వెళ్లడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గొడవలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని మండలవాసులు కోరారు.

పామిడి: పట్టణంలోని కాగితాలవీధిలో కొలువుదీరిన ఇమాం కాశీం పీర్లస్వాములను సోమవారం రాత్రి శోభాయానంగా అలంకరించారు. ఈసందర్భంగా ముజాఫర్లు పీర్లస్వాములకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫతెహా చేశారు. భక్తులు చక్కెర చదివించారు.

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర చదివించారు.